



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 15 నవంబర్ 2025 పేజీలు : 04


# జిల్లా కేంద్రం చేసి.. హిందూపురం ప్రజల రుణం టిడిపి తీర్చుకోవాలి

## నేటి నుంచి బాలయ్య పర్యటన






**హిందూపురం నవంబర్ 14 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నాలుగు దశాబ్దాలకు పైగా హిందూపురం అసెంబ్లీ స్థానం లో వరుస విజయాలతో పార్టీకి కంచుకోటగా రికార్డులకెక్కింది. ఇంతటి ఘనకీర్తికి కారణమైన హిందూపురం ప్రజల రుణం తీర్చుకునేందుకు తెలుగుదేశం పార్టీకి సరైన సమయం వచ్చిందని, ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రెండవ అతిపెద్ద పట్టణమైన ప్రముఖ వాణిజ్య కేంద్రం హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత వైసిపిప్రభుత్వంలో ఏర్పాటైన కొత్తజిల్లాలు అశాస్త్రీయంగా జరిగాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాజాగా ఏపీలో కొత్తజిల్లాల ఏర్పాటుకు క్యాబినెట్ సబ్ కమిటీ వేశారు. ఈ కమిటీ కొత్త జిల్లాల ఏర్పాటు, జిల్లాల పునర్విభజన ప్రక్రియ పై అధ్యయనం చేస్తోంది. కొద్దిరోజులుగా రాజకీయ వర్గాలు మీడియాలో వస్తున్న కథనాలప్రకారం కొత్తజిల్లాలఏర్పాటు జాబితాలో హిందూపురంలేదని ప్రచారం జరుగుతోంది. ఇది ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. హిందూపురం టిడిపి ప్రాంతమని భావించి గత వైసిపిప్రభుత్వం ఇక్కడ ప్రజల ఆశలపై నీళ్లు చల్లి పుట్టపర్తిని జిల్లా కేంద్రం చేసింది. ఇప్పుడేమో టిడిపి అధికారంలో ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంచేస్తారా లేదా అనేఅనుమానాలు ప్రజల్లో ఏర్పడ్డాయి. నాడు వైసిపి హిందూపురాన్ని జిల్లా చేయకుండా అన్యాయం చేస్తే.. నేడు టిడిపి కూడా అదే దారిలో పయనిస్తే రెండుపార్టీలకు తేడా ఏముంటుందని ప్రశ్నలు వస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాపేరుతోనే హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. వైసిపి ప్రభుత్వం ఉన్న సమయంలో హిందూపురం రోడ్లపై ఎమ్మెల్యే బాలకృష్ణ బైఠాయించి జిల్లా కేంద్రం కోసం ఆందోళన చేశారు. అంతేకాకుండా 2024 ఎన్నికల ప్రచారంలో తమపార్టీని గెలిపిస్తే హిందూపురం జిల్లా చేస్తామని కూడా బాలయ్య ప్రకటించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనిప్రజలుకోరుతున్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. అదేకోవలో నందమూరి హరికృష్ణను, నేడు మూడు సార్లు వరుసగా బాలయ్యను ప్రజలు హ్యాట్రిక్ విజయాలతో గెలిపించారు. 40 ఏళ్లుగా టిడిపిని గెలిపిస్తున్న హిందూపురానికి ఆ పార్టీ ఏమి చేసింది..? అనే విమర్శలకు చెక్ పెట్టే అవకాశం టిడిపి ప్రభుత్వం ముందు ఎదురుచూస్తోంది.ఇదిలా ఉండగా జనాభా, భౌగోళికంగా, వాణిజ్య, పారిశ్రామిక, అన్ని రంగాల్లో కూడా హిందూపురం టాప్ ప్లేస్ లో ఉంది. రెండు లక్షల పైగా జనాభా ఉండ డంతోపాటు పారిశ్రామికంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధించింది. కర్ణాటక బెంగళూరు నగరానికి సమీపంలో ఉన్నందున శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీల చెల్లింపులో హిందూపురం మొట్టమొదటి స్థానంలో నిలిచింది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల్లో కంటే హిందూపురం లో విద్యుత్ బిల్లుల ఆదాయంలో మొట్టమొదటి స్థానంలో పదేళ్లుగా కొనసాగుతోంది. వైద్య సౌకర్యాలు, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు, నేషనల్ హైవేలు, ప్రధాన రైల్వే లైన్ లతో తూర్పు, దక్షిణ, ఉత్తర భారత దేశ ప్రాంత రాకపోకల కనెక్టివిటీ ఉంది. అంతేకాకుండా బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కు హిందూపూర్ నియోజకవర్గం కేవలం 50 కిలోమీటర్ల దూరంలోనే ఉండడంవల్ల ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, తదితర వర్గాల ప్రజలకు కూడా ఎంతో సౌలభ్యంగా ఉంది. భౌగోళికంగా హిందూపురం రాష్ట్ర సరిహద్దుకు అనుకొని ఉందని, అందుకే జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు సరైనది కాదని జరుగుతున్న అసంబద్ధ ప్రచారాన్ని ప్రజలు తిప్పికొడుతున్నారు. కర్నూలు నగరం తెలంగాణ రాష్ట్ర సరిహద్దు అనుకుని ఉందని, అదే రీతిన నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి ఇలా ఎన్నో జిల్లా కేంద్రంగా ఉండగా ఒక హిందూపురానికే అభ్యంతరం ఏంటని నిలదీస్తున్నారు. మరోవైపు జిల్లా కేంద్రం అంశంపై తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు ఇప్పటికీ జిల్లా కేంద్రం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రాజకీయ వర్గాలు, ప్రజల్లో జిల్లా కేంద్రం హాట్ టాపిక్ గా మారిన క్రమంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు హిందూపూర్ నియోజకవర్గంలో పర్యటించేందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృ ష్ణవస్తుండడం సర్వత్ర ఉత్కంఠను రేపుతోంది.

# నేడు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ రాక

**శ్రీ సత్యసాయి జిల్లా, నవంబర్ 14, ప్రభాతవార్త ప్రతినిధి**

కేంద్ర వాణిజ్య పారిశ్రామిక శాఖ మంత్రి పియూష్ గోయల్ శనివారం పుట్టపర్తి కి రానున్నట్లు అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలియజేశాయి. ఆయన శనివారం మధ్యాహ్నం 02:00 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం ఎయిర్పోర్ట్ నుండి బయలుదేరి 03:00 గంటలకు శ్రీ సత్యసాయి విమానాశ్రయం చేరుకొనున్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం 3:30 గంటల నుండి 4:30 గంటల వరకు భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవంలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయం చేరుకొని సత్యసాయి మహా సమాధిని దర్శించుకుని, అక్కడే గంటసేపు గడపనున్నారు. సాయంత్రం 5:00 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుండి ముంబైకి తిరుగు ప్రయాణం అవుతారని అధికార వర్గాలు తెలియజేశాయి.

# శతజయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

**- భక్తుల కొరకు 300 అదనపు బస్సులు, 165 ప్రత్యేక రైళ్లు - 5 వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత - జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్**











కమాండ్ కంట్రోల్ రూమ్ లో సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ , త్రాగునీటి వసతిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ , పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ , ఉచిత వైద్య శిబిరం ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 14, ప్రభాతవార్త ప్రతినిధి**

భగవాన్ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను భవ్యంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తిలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో కలెక్టర్ మాట్లాడుతూ పెద్ద జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, మొత్తం కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జి ఓ ఎమ్) ను నియమించిందని చెప్పారు. వారు ఇప్పటికే సమీక్షించి అనేక కీలక సూచనలు అందజేశారని వివరించారు. పుట్టపర్తికి వచ్చే భక్తుల కోసం రైల్వే స్టేషన్ నుండి ప్రశాంతి నిలయం వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేసి రవాణా సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే సమీప ప్రాంతాల నుండి దాదాపు 300 అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, యాత్రికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచనున్నట్లు కలెక్టర్ తెలిపారు రైల్వే శాఖ ద్వారా 165 స్పెషల్ రైళ్లు నడపనున్నట్టు సమాచారం ఉందన్నారు. ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో యాత్రికుల కోసం విస్తృతంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా ఫుడ్ కౌంటర్లు, మెడికల్ క్యాంపులు త్రాగునీరు ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాల్లో ప్రత్యేక ఫుడ్ కౌంటర్లు, అన్ని పార్కింగ్ ప్రాంతాల్లో రాత్రి వేళ అవసరమైన లైటింగ్ సదుపాయాలు, వృద్ధులు, వికలాంగులకు మినీ బస్సుల ద్వారా ప్రత్యేక రవాణా, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో 300 మంది శానిటేషన్ వర్కర్లు మరియు సూపర్వైజర్లు నియమించి పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఈ నెల 19 నుండి 23 వరకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అనేక మంది ప్రముఖులు పుట్టపర్తి చేరుకునే అవకాశముందని చెప్పారు. వారి రాకపోకల కోసం ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక రవాణా సౌకర్యాలు సిద్ధం చేశామని తెలిపారు. 5,000 మంది పోలీసుల నియామకంపుట్టపర్తి మొత్తం ప్రాంతంలో రద్దీ తగ్గేందుకు, భద్రత బలోపేతం చేసేందుకు.. 5 వేల మంది పోలీసులు షిఫ్టుల వారీగా విధుల్లో నియమించారని, ఏదైనా అత్యవసర పరిస్థితిని వేగంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక యంత్రాంగం సిద్ధం ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 ప్రకారం పర్యవేక్షణ చేస్తారని, అదేవిధంగా పట్టణం చుట్టుప్రక్కల 250 నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యాత్రికులు ఏదైనా సమాచారానికి లేదా సహాయానికి 1800 233 5598 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయవచ్చన్నారు.ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీ చెప్పవేంటి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పుట్టపర్తి పట్టణ పరిధిలోని ఏర్పాట్లను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. శుక్రవారం ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ ను కలెక్టర్ సందర్శించి స్టేషన్ లోపల, వెలుపల ఏర్పాట్లను పరిశీలించారు. రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి రావడానికి ఉచిత బస్సులు ఏర్పాటు, అక్కడి ప్రదేశంలో వాహనాలు, కార్లు, బస్సుల పార్కింగ్, త్రాగు నీటి వసతి, ఉచిత వైద్య శిబిరం తదితరాలను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఎయిర్పోర్టు నుంచి ప్రశాంతి నిలయం వరకు రహదారి ఇరువైపులా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం దాటాక శిల్పారామంకు వెళ్లే దారిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించి విధులలో ఉన్న సిబ్బంది నిర్వహిస్తున్న పనిని పరిశీలించి, తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఆర్టీసీ, మున్సిపల్, పంచాయతీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శతజయంతి వేడుకలకు పెరుగుతున్న భక్తుల రద్దీ ..

**- సుందరంగా ముస్తాబైన పుట్టపర్తి పురవీధులు - ప్రత్యేక ఆకర్షణగా సత్యసాయి లేజర్ షో**





వాటర్ అండ్ లేజర్ షోలోని ఒక దృశ్యం. , సుందరంగా ముస్తాబైన పుట్టపర్తి పురవీధులు.

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త:**

భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలకు దేశ విదేశాల నుండి భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతుండడంతో పుట్టపర్తి పురవీధులు భక్తులతో కి కిటకిటలాడుతున్నాయి.పెరుగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకొని సెంట్రల్ ట్రస్ట్ మరియు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ప్రశాంతి మందిరం వెస్ట్ గెట్, విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన, చైతన్య జ్యోతి, భక్తులకు వసతి, మరుగుదొడ్లు,త్రాగునీటి సౌకర్యం కల్పించారు. ఉదయం అల్పాహారం మొదలుకొని రాత్రి భోజనం వరకు అన్న ప్రసాదాన్ని ఈనెల 13 నుండి 24 వరకు భక్తులకు అందిస్తున్నారు. పుట్టపర్తి పురవీధులు, సత్యసాయి విద్యాసంస్థలు, పరిపాలనా భవనాలు, ప్రధాన రహదారులు రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో ప్రకాశిస్తున్నాయి. వివిధ ఆకృతులతో ఏర్పాటుచేసిన స్వాగత తోరణాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. సత్యసాయి వైభవాన్ని తెలుపుతూ చిత్రావతి హారతి ఘాట్లో ప్రదర్శిస్తున్న వాటర్ అండ్ లేజర్ షో వేడుకల్లో ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్లోని 10 జోన్ల నుండి వేలాది మంది విదేశీ భక్తులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. హిల్ వ్యూయు స్టేడియంలో 19న జరిగే మహిళ దినోత్సవ వేడుకల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతుండడంతో పటిష్ట బందోబస్తు చర్యలను ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు.రవాణా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నలుమూలల నుండి 300 బస్సులు పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులుగా నడపనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మరో 200 బస్సులను పెంచనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 12 ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలందించనున్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మొబైల్ టాయిలెట్స్, త్రాగునీరు, పార్కింగ్ ప్రదేశాలు, లైటింగ్, చిత్రావతి సుందరీకరణ, రహదారి మరమ్మత్తుల ను, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులను చేపట్టారు. తిరుమల తరహాలో పుట్టపర్తి ప్రధాన రహదారుల గుండా సాయిశ్వరాయ విద్మహే అను నామస్మరణ భక్తులలో ఆధ్యాత్మికతను నింపుతోంది. భద్రతా చర్యల దృష్ట్యా 214 నిఘా కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రముఖ వీణ వాయిద్య కారిని రూపాపనకర్ బృందం అద్భుతమైన సంగీత ప్రదర్శనను నిర్వహించారు.

# ప్రమాదమా..పథకమా..?

**- తిరుమల పరకామణి కేసులో కీలక అధికారి మృతి**
**- తాడిపత్రి సమీపంలో రైలు పట్టాల పక్కన అనుమానాస్పద మృతి**
**- పథకమేనంటున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు**
**-పోలీసు ఉన్నతాధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ**



విచారణకు వెళుతూ విగతజీవిగా మారిన ఆర్ఐ సతీష్‌కుమార్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్







అప్పటి తిరుమల ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సతీష్ సోదరుడు హరి,వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ శ్రీనివాసులు ఆచారి

**తాడిపత్రి, నవంబరు 14, ప్రభాతవార్త:**

గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న పరకామణి కేసులో కీలక అధికారిగా వ్యవహరిస్తున్న అప్పటి టీటీడీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ప్రస్తుత ఆర్ఐ సతీష్ కుమార్ మృతి ప్రమాదకరమా..పథకమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం తాడిపత్రి సమీపంలోని జూటూరు–కోమలి మధ్య రైలు మార్గంలో పట్టాల పక్కన విగతజీవిగా పడి ఉన్న విషయాన్ని గమనించిన రైల్వే ట్రాక్‌మెన్‌లు సంబంధిత అధికారులకు సమాచారమిచ్చారు. 10.30 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలంలో రక్తపు గాయాలతో చనిపోయిన సతీష్ మృతదేహం వద్ద లభ్యమైన ఐడీ కార్డు ద్వారా మృతుడు ఎవరనే విషయాన్ని గుర్తించారు. గతంలో తిరుమల ఏవీఎస్‌వోగా విధులు నిర్వహించి, ప్రస్తుతం గుంతకల్లులో ఆర్ఐ(రిజర్వ్ ఇన్‌స్పెక్టర్)గా విధులు నిర్వహిస్తున్న ప్యాపిలికి చెంతిన సతీష్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో చోటు చేసుకున్న పరకామణి చోరీ కేసులో ఫిర్యాదు దారునిగా ఉన్న సతీష్‌కుమార్, లోక్‌అదాలత్‌లో రాజీ అయిన కేసును ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి తిరుపతి పద్మావతి అతిథి గృహంలో సీఐడీ ముందు హాజరవడానికి గుంతకల్లు నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి వెళుతున్నారని తెలిసింది. సతీష్ మృతి సమాచారమందుకున్న డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సతీష్‌కుమార్ ఎక్కడ కింద పడ్డాడు, ఆయన మృతదేహం ఎంత దూరం వచ్చిపడింది అనే విషయాలను అక్కడి సిబ్బంది పోలీసు అధికారులకు వివరించారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి జాగిలాలు, క్లూస్‌టీమ్‌లతో సంఘటనా స్థలాన్ని జల్లెడ పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన పరకామణి చోరీ కేసులో మృతుడు సతీష్ కీలక అధికారి కావడంతో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షుణ్ణంగా పరిశీలించారు. సతీష్ మృతదేహం కింద పడిన చోట నుంచి 200 అడుగుల దూరంలో పడిపోవడం, ప్రయాణీకులు ఎవరూ చైను లాగి రైలు ఆపకపోవడం పట్ల కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రధాన కేసులో కీలక అధికారిగా ఉండటంతో సతీష్‌కుమార్ మృతి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

**:ప్రయాణం..మరణం మధ్యలో ఏమి జరిగిందోనని విచారిస్తున్నాం -శ్రీనివాసులు ఆచారి, రైల్వే డీఎస్పీ, గుంతకల్లు.**

తిరుపతిలో నేడు జరగనున్న సీఐడీ విచారణకు హాజరవడానికి గుంతకల్లులో టికెట్ తీసుకొని రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేసిన సతీష్‌కుమార్ మధ్యలో మరణించడం వెనుక ఏమి జరిగిందోననే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. పలు విషయాలు విచారణలోనే ఉన్నాయి. పూర్తి విచారణ తర్వాత అన్ని విషయాలు నిర్ధారించుకొని వెల్లడిస్తాం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తాం. దర్యాప్తు కొనసాగుతున్నందున కూలంకుషంగా విచారించిన తర్వాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

**:ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యగానే భావిస్తున్నాం -హరి, ఎస్సై సోదరుడు, ప్యాపిలి.**

ఇలాంటి దారుణమైన పరిస్థితి మా సోదరునికి ఎదురవుతుందని ఊహించలేదు. ఇలాంటి పరిస్థితి నిజాయితీగా పనిచేసే ఏ అధికారికి కూడా రాకూడదు. మా ఏ అధికారి సమాచారం ఇవ్వలేదు. మీడియా ద్వారానే తెలుసుకుని ఇక్కడికి వచ్చాం. ఇది ఉద్దేవపూర్వకంగా చేసిన హత్యగానే మేము భావిస్తున్నాం. ఎవరికి ఎలాంటి హాని చేయని, చాలా వరకు సర్దుబాటు మనస్తత్వం ఉన్న వ్యక్తి మా సోదరుడు. పరకామణి చోరీ కేసుకు సంబంధించి అప్పట్లో అధికారులు ఒత్తిడి తెచ్చి లోక్‌అదాలత్‌లో రాజీచేయించి మా సోదరున్ని బలి తీసుకున్నారు. ఆ తర్వాత ఏ అధికారి కూడా మా సోదరుని పరిస్థితిని పట్టించుకోలేదు. పూర్తి విచారణ చేపట్టి మా సోదరునికి న్యాయం చేయాలి. మా సోదరుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. పోలీసులకే రక్షణ కరవైతే ఎలా..?

# అట్టహాసంగా టిడిపి మండల కన్వీనర్ల ప్రమాణ స్వీకారోత్సవం

**- తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత. - కలసికట్టుగా స్థానిక సంస్థల్లో విజయభేరి మోగిద్దాం**

**- టిడిపి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



బైక్ ర్యాలీలో వెళ్తున్న ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త**

కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం పార్టీ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. రాయదుర్గం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నుండి మద్దానేశ్వర స్వామి ఆలయం వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మద్దానేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తగా ఎంపికైన తెలుగుదేశం పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, కో యూనిట్ ఇంఛార్జిలు, బి.ఎల్.ఎలు , కో బి.ఎల్.ఎలు మరియు గ్రామ, వార్డు కమిటీ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్యకర్తల కష్టం పైనే తెలుగు దేశం పార్టీ ఎన్నికల్లో గొప్ప విజయాలు సాధిస్తూ వస్తుందన్నారు పార్టీకి వాళ్లే అధినేతలని, ఎవరికి ఏకష్టం వచ్చినా అన్ని విధాల ఆదుకోవడానికి పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ కార్యకర్తకు ఏ అవసరం వచ్చిన మీ పరిధిలో వాటిని నెరవేర్చాలన్నారు. తమ వద్దకు వచ్చే ప్రతి కార్యకర్త సమస్యను ఓపిగ్గా వింటూ, తగిన పరిష్కారం సూచించాలన్నారు. ఒకవేళ మీ వల్ల పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు చక్కటి అనుసంధానకర్తలుగా పని చేయగలిగితే రాబోయే రోజుల్లో పార్టీకి ఎదురు ఉండదన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులు ప్రతి స్థానంలో భారీ మెజారిటీతో గెలిపించడానికి కొత్త సారథులు ఇప్పటి నుండే కార్యోన్ముఖులు కావాలన్నారు. ఆ బాధ్యతను ప్రతి ఒక్కరు తమ భుజస్కందాలపై వేసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక సమస్యలు ఓవైపు వెంటాడుతున్న చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో దూసుకుపోతుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, మంత్రి లోకేష్ బాబుల కష్టంతో రాష్ట్రం అభివృద్ధి వైపు శరవేగంగా దూసుకుపోతుందన్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి విరివిగా ముందుకు వస్తున్నాయన్నారు. రూ.9.80 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. వీటి ప్రారంభంతో రాష్ట్రం దశ, దిశ ఎక్కడికో పోతుందన్నారు. గడచిన 17 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని అనునిత్యం ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాల్లో ముఖ్యంగా పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, శ్రీ శక్తి తదితర వాటిని ప్రజలకు అనునిత్యం వివరిస్తూ ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ పటిష్టత కోసం మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. రాయదుర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లాలన్న తన సంకల్పానికి మీ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కాలవ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంకట శివ యాదవ్, నూతన మండల పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, వన్నా రెడ్డి, మోహన్ రెడ్డి, కాలవ సన్నన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి, పసుపులేటి నాగరాజు, క్లస్టరుల పురుషోత్తం, ఇనాయత్, తలారి గంగాధర్, కురుబ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భనాలను బిపిఎస్ స్కీమ్ ద్వారా క్రమబద్ధీకరించుకోండి

## -కమిషనర్ బాలస్వామి

**అనంతపురం నవంబరు 14 ప్రభాతవార్త**

నగరంలో నిబంధనలు ఉల్లంఘించి నిర్మించుకున్న భవనాలను బిపిఎస్ స్కీమ్ ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి.బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశాడు. ప్రభుత్వం ఈ అనధికార, నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేసినవారికి సువర్ణావకాశం కల్పించిందని, ఈ స్కీమ్ జనవరి 01, 1985 నుంచి ఆగస్టు31,2025 మధ్యకాలంలో నిర్మించుకున్నవారికి ఒక అవకాశం మాత్రమే కల్పించిందన్నాడు. నేటి నుంచి 120 రోజుల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని క్రబద్ధీకరించుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి నిబంధనలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని నగర ప్రణాళిక విభాగం (సిటీ ప్లానింగ్) విభాగంలో సంప్రదించవచ్చని ఆయన తెలియజేశాడు.

02ATP27_02ATP27.qxd 14-11-2025 PM 10:40 Page 1



## కొల్లాపురమ్మ దేవి విగ్రహ, కలశ, ధ్వజస్థంభ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని

### ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం

బ్రహ్మ సముద్రం నవంబర్14 ప్రభాతవార్త



కొల్లాపూర్మ దేవిని దర్శించుకుంటున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండలంపరిధిలోని పాలవెంకటాపురం గ్రామం గ్రామస్థుల ఆహ్వానం మేరకు కొల్లాపురమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట, కలశ, ధ్వజ స్థంభం ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు , టీడీపీ సీనియర్ నాయకులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అమిలినేని టీడీపీ నాయకులకు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని నియోజకవర్గంలోని ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో మంచి పంటలు పండలని, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకుని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులకు తన వంతుగా విరాళం అందజేశారు.

## వ్యవసాయ, అనుబంధ మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం వార్షిక మహాసభ

బెలుగుప్ప, నవంబర్ 14 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున

బెలుగుప్ప మండలం రవితేజ మండల సమాఖ్యలో బెలుగుప్ప వ్యవసాయ, అనుబంధ మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం వార్షిక మహాసభ మహిళా రైతు సంఘాల లీడర్లతో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, ఎక్స్ ఎంపీపీ తిమ్మప్ప, కోనాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు గోవింద్ పాల్గొన్నారు. మహిళ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ద్వారా ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు తక్కువ రేట్లకు అందించడం జరుగుతుందని, ఉమ్మడిగా వ్యవసాయ పనిముట్లు ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసి మహిళా రైతులకు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఏపిఎం సురేఖ పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మల్లికార్జున, ఎక్స్ ఎంపీపీ తిమ్మప్ప, కోనాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు గోవింద్, సిసిలు రాంప్రభూ, మంజునాథ, శివప్రసాద్, నారాయణప్ప, అకౌంటెంట్ నాగమణి, మహిళా రైతు సంఘం లీడర్లు హాజరయ్యారు.

## స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు బెలుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి

బెలుగుప్ప, నవంబర్ 14 ప్రభాతవార్త



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి భరత్ 9వ తరగతి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిడి గోపాల్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 14న ఆర్‌డిటి స్పోర్ట్స్ విలేజ్, అనంతపురంలో జరిగిన బేస్‌బాల్ జిల్లా స్థాయి సెలెక్షన్స్‌లలో భరత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా, కోవూరులో ఈనెల 15 నుండి 17 వరకు జరిగే అండర్-19 బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాల్గొనడానికి వెళ్లినట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయు శ్రీమతి సరిత తెలియజేశారు. స్కూల్ పాఠశాల కమిటీ చైర్మన్ రుద్రన్న, గోపాల్ రెడ్డి, పిడి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో విజయంతో తిరిగి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బొమ్మనహాల్ నవంబర్ 14 (ప్రభాతవార్త):



గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న విద్యాధికారి మల్లికార్జున

జిల్లా గ్రంథాలయ సంస్థ, అనంతపురం ఆదీనములో పనిచేయుచున్న శాఖా గ్రంథాలయం బొమ్మనహాల్ నందు ఈరోజు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక ఎం.పీ.పీ. స్కూల్ నందు ఘనంగా ప్రారంభించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాధికారి2 మల్లికారున శుక్రవారం ప్రారంభించారు. మొదటిగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న అపార పుస్తకసంపదను ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని, ఎక్కడ అందుబాటులో లేని పురాతన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయన్ని తెలిపారు. అలాగే గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవడం మనందరి భాధ్యతఅని, గ్రంథాలయ ఉద్యమకారులైన ఎస్.ఆర్. రంగనాథన్, కల్లూరు సుబ్బారావు, అయ్యాంకి వెంకటరమణయ్య మొదలగువారి కృషి వల్లనే ఈ రోజు ఇన్ని గ్రంథాలయాలు ఏర్పడ్డయని తెలిపారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు అన్ని రకాల పుస్తకాలు చదవాలని, ఏ ఒక్క పుస్తకం తక్కువ కాదని చిన్న పుస్తకం చదవడం ద్వారా కూడా ఎంతో జ్ఞానం సంపాదించవచ్చని తెలియజేసారు. ఈ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తాం అని, ప్రతి ఒక్క విద్యార్థి ఆసక్తిగా పాల్గొని విజయవంతం చేయాలనీ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఏ. బాబా ప్రసాద్ , ప్రధానోపాధ్యాయురాలు సాయి లీల , ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

బ్రహ్మ సముద్రం నవంబర్ 14 ప్రభాతవార్త



గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 1411 2025 తేదీన గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇవి 2011 2025 వరకు కొనసాగునున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అనగా 14 112025 వ తేదీన జవహర్లాల్ నెహ్రూ గారి జయంతి మరియు బాలల దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకట నారాయణ సార్ గారు హాజరయ్యారు. వారు పిల్లలను ఉద్దేశించి గ్రంథాలయాల ఆవశ్యకతను గురించి వివరించారు . పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమని పుస్తక పఠన ఆసక్తిని పెంచుకోవాలని పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి బి ఎర్రిస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని వారోత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేత

కంబదూరు, నవంబర్ 14, ప్రభాత వార్త



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సురేంద్ర బాబు

బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలు చదవాలి ,ఆడపిల్లలు ఎదగాలి అనే వ్యాసరచన పరీక్ష పోటీల్లో కంబదూరుకు చెందిన పలువురు విద్యార్థులు ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనురాధ, ద్వితీయ సంవత్సరం జూనియర్ కళాశాల దీప్తి , కేజీబీవీ పాఠశాల బేబీ, ములకనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేహ లకు ఎమ్మెల్యే సురేంద్రబాబు చేతుల మీదుగా కళ్యాణదుర్గంలో శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మజ, సుశీలమ్మ ,ఓబులమ్మ, భారతి, పాల్గొన్నారు.

## ఘనంగా జె.వి.ఎస్. విగ్రహ ఆవిష్కరణ

హిందూపురం నవంబర్ 14 ప్రభాతవార్త



ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

తెలుగుదేశం పార్టీ దివంగత సీనియర్ నేత జె.ఇ. వెంకట స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగింది. స్థానిక పరిగి రోడ్డు పక్కన శ్రీ కంచి కామాక్షి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన జెవిఎస్ విగ్రహాన్ని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీఎస్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. జేవిఎస్ తనయుడు మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల హిందూపురం రాజకీయ చరిత్రలో వెంకటస్వామి ప్రజా సమస్యల పరిష్కారంలో చెరగని ముద్ర వేసుకున్నాడని కొనియాడారు. ముఖ్యంగా సాధుచెట్టి కులాన్ని ఉద్ధరించిన నేతగా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయాడని, అందుకే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల భావితరాలకు జేవీఎస్ సేవలు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. ఈనెల 16న జెవిఎస్ కళ్యాణమండపంలో మొదటి వర్ధంతి వేడుకలు జరుపనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో సాధుచెట్టి సంఘం ప్రతినిధులు జిసి శ్రీధర్, రమేష్, ప్రియా గంగాధర్ బ్యాంకు శివ కుమార్, నర్సోజి, అజంతా శేఖర్, రామ్మూర్తి, గంగాధర్, తెలుగుదేశం పార్టీ నాయకులు నెట్టప్ప, దేమకేతపల్లి అంజనప్ప, దుర్గా నాని, టీడీపీ కార్యకర్తలు, జేవిఎస్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈరన్న జాతర కరపత్రాలు ఆవిష్కరణ

కుందుర్పి, నవంబర్ 14, ప్రభాతవార్త

కుందుర్పి మండలం జంబుగుంపల గ్రామంలో ఈనెల 15 న జరిగే ఈరన్న జాతరకు ఎమ్మెల్యే సురేంద్ర బాబును శుక్రవారం టీడీపీ నాయకులు ఆహ్వానించారు.అనంతరం జాతరకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నివాళులర్పించి సంతాపం తెలిపిన... వాల్మీకి సంఘం అధ్యక్షులు

డి.హిరేహాళ్ నవంబరు 14 ప్రభాతవార్త



నివాళులర్పిస్తున్న వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప ఆ సేవా సమితి ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప మిత్రులు లతో కలిసి శుక్రవారం గొల్ల రామాంజనేయులు(36) భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. రాయదుర్గం పట్టణానికి చెందిన మృతుడు అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం పట్టణంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చందడం జరిగింది. సమాచారం తెలుసుకున్న వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు తమ పరివారంతో మృతుడి స్వగృహంకుచేరుకుని నివాళులుఅర్పించి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆసేవా సమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, సభ్యులు లాలెప్ప, మిత్రులు న్యాయవాది సూర్య జాన్సన్, విశ్రాంతి ఉద్యోగి గొల్లగోపాల్, చిరు వ్యాపారి గాజుల భీమరాజులు ఉన్నారు.


## మండల కన్వీనర్ వన్నా రెడ్డి ప్రమాణ స్వీకారానికి తరలిన తెలుగు తమ్ముళ్లు

కనేకల్లు నవంబర్ 14 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీలో చాలా ఏళ్లగా ఉంటు పార్టీకి సేవ చేసిన యర్రగుంట వన్నారెడ్డి మండల కన్వీనర్‌గా ప్రమాణస్వీకారానికి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేలాదిగా రాయదుర్గానికి యర్రగుంట నుండి శుక్రవారం తరలి వెళ్లారు. యర్రగుంట నుండి భారీగా బైక్ ర్యాలీ కనేకల్ క్రాసింగ్‌నుండి రాయదుర్గంకు బయలుదేరారు.తెలుగుదేశంపార్టీ క్లస్టర్‌ఇంచార్జ్ ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలి వెళ్లారు అలాగే మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుండి ఆయా గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

## హలో దళిత చలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ

కంబదూరు, నవంబర్ 14, ప్రభాతవార్త



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హలో దళిత చలో ఢిల్లీ కరపత్రాలను శుక్రవారం కంబదూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బ్రహ్మయ్య మాదిగ కమిటీ జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20 న జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నేతలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసురు పాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో హలో దళిత చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు కృష్ణపురం బాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నల్లప్ప , మండల అధ్యక్షులు గంపల రామాంజి , గోపాల్ ,సన్న, అజిత్ ,రఘు, తిమ్మ,తరుణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఫలితాలపై బిజెపి సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

హిందూపురం టౌన్ నవంబర్ 14 ప్రభాతవార్త

బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలకు శుక్రవారం ఫలితాలు వెలువడి ఎన్డీఏ కుటుంబ విజయం సాధించడంతో హిందూపురం పట్టణంలో బిజెపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. బిజెపి పట్టణ అధ్యక్షురాలు అంజలి రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద బిజెపి నాయకులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అసత్య ప్రచారాలను బీహార్ ప్రజలు నమ్మకుండా బిజెపి వైపు నిలబడ్డారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎంత అసత్య ప్రచారాలు చేసిన దేశంలో ఎవరు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజ రెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హిందూపురం టౌన్ నవంబర్ 14 ప్రభాతవార్త



పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, మాలధారణ భక్తులు

హిందూపురం పట్టణంలోని పాండు రంగ నగర్ లో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి నవగ్రహ, మృత్యుంజయ హోమం, ఆంజనేయ, సుబ్రహ్మణ్య, స్వామివార్లకు హోమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి మూలవిరాట్ కు పంచామృత, అష్టద్రవ్యములతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడం వరప్రసాద్, శంకర్, ఆలయ అధ్యక్షుడు బాలచంద్ర, రమేష్, గురుస్వామి రాఘవేంద్ర, కిరికెర ఆలయ గురుస్వామి ఠాగూర్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా అన్నపూర్ణేశ్వరి విగ్రహ పునః ప్రతిష్టాపన

హిందూపురం నవంబర్ 14 ప్రభాతవార్త



హిందూపురం పట్టణంలోని నంది కూడలి వద్ద వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలోని మాత అన్నపూర్ణేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు బాలాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయంలో చండీ హోమం నిర్వహించారు ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## రహదారి నిర్మాణంకు భూమి పూజ



రహదారి నిర్మాణంకు భూమి పూజ చేస్తున్న మండల కన్వీనర్

డి.హిరేహాళ్ నవంబరు 14 ప్రభాతవార్త

ఎట్టికెలకు రెండు గ్రామాలను కలిపే రహదారికి మండల తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి ఆ పార్టీ సీని యర్ నాయకులు సదాశివరెడ్డి, నారాయణస్వామి, మండల తెలుగు యువత అధ్యక్షుడు గోవిందు, ఆ పార్టీ శ్రేణులతో కలిసి అట్టహాసంగా భూమి పూజ నిర్వహించి నిర్మాణం పనులు చేపట్టారు. శుక్రవారం డి.హిరేహాళ్ మండలం నాగలాపురం, తిమ్మాలాపురం గ్రామాల రహదారి నిర్మాణంతోపాటు వాగుపై నిర్మించిన వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో నిర్మాణంకు భూమి పూజ నిర్వహించారు. ఈ రెండు గ్రామాల మధ్య బిటి రోడ్డు, వంతెన నిర్మాణంకు రూ. 1.60 కోట్లు ప్రభుత్వ నిధులు మంజూరు కావడంతో తెదేపా నాయకులు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమముకు ప్రాధాన్యతనిస్తోందని అందులో భాగంగా ఈ రహదారి నిర్మాణం చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దాస్ నాయక్, ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి, తెదేపా నాయకులు మాజీ సర్పంచ్ తిమ్మయ్య, మాజీ ఎంపీటీసీలు గుండ్లపల్లి వెంకటేశులు, కెసి హనుమంతు, సి.దేవేంద్ర, కే.లింగ రెడ్డి, తిమ్మాలాపురం బొజ్జప్ప, రాజేష్, బిజెపి నాయకులు మల్లేష్, గోపాల్, కాంట్రాక్టర్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 17 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

### జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్

పుట్టపర్తి (కల్చరల్),నవంబర్ 14, ప్రభాతవార్త

సత్య సాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23వరకు స్థానిక శిల్పారామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5.30 "గం"నుండి రాత్రి 8.30 "గం" వరకు వివిధ ప్రముఖ సంగీత నృత్య కళా సంస్థల ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఉచితంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈనెల 17న సోమవారం తొలిరోజు శ్రీదేవి గ్రూప్ కూచిపూడి డాన్స్ అకాడమీ అనంతపురము కళాబృందం, 18న మంగళవారం పుట్టపర్తి సాయి విద్యాలయం డాన్స్ స్కూల్ వారి కార్యక్రమాలు, 19న బుధవారం శాంతి గ్రూప్ అనంతపురం కళాబృందం, 20నగురువారం కళ్యాణచక్ర వర్తి డాన్స్ గ్రూప్ అనంత పురము కళాబృందం బృందం, 21న శుక్రవారం శ్వేతా ప్రసన్న డాన్స్ అకాడమీ భరతనాట్యం బెంగళూరు బృందం, 22న శనివారం శనివారం లలిత నాట్య కళా నికేతన్ ధర్మవరం కళాబృందం, 23న ఆదివారం శ్రీ సత్య సాయి బాబా జయంతి వేడుకల రోజున రాగిణి అయ్యార్ బెంగళూరుకళాకారుల బృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. అలాగే సత్య సాయిబాబా శత జయంతి సందర్భంగా స్థానిక శిల్పారామంలో ఈనెల 15 నుండి 25 వరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత డ్వాక్రా బజార్ 2025 ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామీణ కళాకారులు తయారు చేసిన చేనేత హస్త కళలు మరియు ఆహార ఉత్పత్తుల ప్రదర్శన హస్తకళలు, గృహ అలంకరణలో చేనేత ఉత్పత్తులు డ్వాక్రా బజార్లో అమ్మకాల నిమిత్తం స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, భక్తాదులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ కోరారు.

## అందరి సమిష్టి కృషితోనే విగ్రహావిష్కరణ విజయవంతం

### ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఎమ్మెల్యే అమిలినేనిని గజమాల, కంబలి, గొర్రెపిల్లతో సన్మానించిన కురుబ సంఘాలు, కురుబ కులస్థులు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కురుబసంఘం నేతలు

కళ్యాణదుర్గం రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఉన్న కురుబలు, టీడీపీ నాయకులు అందరి సహకారంతోనే భక్త కనకదాసు విగ్రహావిష్కరణ విజయవంతం అయిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు..కనకదాసు విగ్రహావిష్కరణ కోసం మంత్రి నారా లోకేష్ కు మెసేజ్ చేసిన వెంటనే సాయంత్రానికే కళ్యాణదుర్గంలో జరిగే కనకదాస జయంతి వేడుకల కోసం వస్తున్నా అంటూ రిప్లై ఇచ్చాడు అంటే అర్థం చేసుకోవాలి, మన కళ్యాణదుర్గం అన్నా, కురుబలు అన్నా ఆయనకు ఎంత ప్రేమ ఉందో చెప్పవచ్చునన్నారు. గతంలో కురుబ కులానికే చెందిన వ్యక్తి మంత్రిగా ఉండి ఏనాడు కురుబలను పట్టించులోలేదని, కష్టపడి సంపాదించిన సొమ్ము అది కూడా ప్రభుత్వానికి టాక్స్ కట్టి ఊయోగిస్తున్నాను తప్ప వేరే రకంగా కాదన్నారు. మీ వైసీపీ నాయకుల మాదిరిగా అన్ని అక్రమాలు చేసి సంపాదించడం లేదని, ఏకంగా తిరుపతి లడ్డునే కల్తీ నెయ్యి ఉపయోగించి తయారు చేశారు అని మీ మాజీ ఈఓ ధర్మారెడ్డి చెబుతున్నాడు అంటే మీ వైసీపీ నాయకులు ఇంకెలాంటి పనులు చేస్తారో అర్థం చేసుకోవాలని ఏద్దేవా చేశారు.. అనంతరం కళ్యాణదుర్గం కురుబ సంఘం నాయకులు, కురుబలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ను భారీ గజమాలతో, కంబలి, గొర్రె పిల్లను బహుకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మూతబడిన అరబిక్ ఉన్నత పాఠశాలను పునః ప్రారంభించండి

### -మంత్రి పయ్యావుల కేశవ్‌కు స్కూల్ కమిటీ, ముస్లీం మైనార్టీల వినతి



మూతబడిన ఆరబిక్ ఉన్నత పాఠశాలవద్ద మాట్లాడుతున్న ముస్లీంలు

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా మూతబడిన అరబిక్ ఉన్నత పాఠశాలను పునః ప్రారంభించాలని అరబిక్ స్కూల్ కమిటీ సభ్యులు, ముస్లీం మైనార్టీలు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మూతబడిన అరబిక్ పాఠశాలవద్ద వారు విలేఖరులతో మాట్లాడారు. ఉరవకొండ మండలంలో ఎంతో ప్రాముఖ్యత కల్గిన పాఠశాలల్లో ఒకటైన అరబిక్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అయితే పాఠశాల వివిధ కారణాలతో కొన్ని సంవత్సరాల క్రితం మూతపడిందన్నారు. దీంతో ముస్లీం విద్యార్థులు చదువుకోవడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనగా అనేక మంది ప్రాథమిక స్థాయిలోనే విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముస్లీం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మంత్రి పయ్యావుల కేశవ్ అరబిక్ ఉన్నత పాఠశాల పునః ప్రారంభానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరబిక్ స్కూల్ కమిటీ సభ్యులు ఎ.రహంతుల్లా, ఇర్షద్, యునుస్‌ఖాన్, సలేహు, ఇమ్రాన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## అపిలేపల్లి లో ఘనంగా బాలల దినోత్సవం

కుందుర్పి, నవంబర్ 14, ప్రభాతవార్త

కుందుర్పి మండలం అపిలేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మప్ప మాట్లాడుతూ భారత దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని బాల దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలియజేశారు. చిన్న పిల్లలపై నెహ్రూకి ఉన్న ప్రేమ ఎంతో గొప్పదని కొనియాడారు. ముఖ్య అతిథులుగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బొమ్మయ్య హాజరయ్యారు.అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బండి కిష్టప్ప

రాయదుర్గం రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త



గృహప్రవేశ కార్యక్రమంలో జ్ఞాపికను అందజేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకులు బండి క్రిష్టప్ప నూతన గృహప్రవేశ వేడుకలకు హాజరై సత్యనారాయణ స్వామి పూజల్లో పాల్గొన్నారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని భంభం స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు లో జి ఎన్ శ్రీనివాసులు నిర్మించిన నూతన గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. జిఎన్ శ్రీనివాసులు దంపతుల ఆహ్వానం మేరకు మిత్రులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి పూజల్లో ఆయన పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు పుచ్చుకుని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. స్వతహాగా వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదిగి తమ కంటూ మంచి ఇల్లు నిర్మించుకోవడం ఎంతో అభినందనీయమని వాల్మీకి సంఘం అధ్యక్షులు జి.ఎన్. దంపతులను అభినందించి ప్రశంసించారు. మరింత కష్టపడి ఆర్థిక పరిస్థితులను మరింత మెరుగుపరచుకుంటూ సాటి వ్యక్తులతో సఖ్యంగా మెలుగుతూ సమాజంలో మరింత మంచి పేరు తెచ్చుకోవాలని అప్పుడే మన జన్మకు సార్థకత లభిస్తుందని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మిత్రులు న్యాయవాది సూర్య జాన్సన్, విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్, భీమరాజులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 17న పిజిఆర్ఎస్ తాత్కాలిక రద్దు

### జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్

పుట్టపర్తి(కలెక్టరేట్), నవంబరు 14, ప్రభాతవార్త

భగవాన్ శ్రీ సత్య సాయి శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 17న సోమవారం జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్ కు రావద్దని జిల్లా కలెక్టర్ కోరారు.

03ATP14_03ATP14.qxd 14-11-2025 PM 11:31 Page 1



## స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్-19 క్రికెట్ జట్టు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్ -19 క్రికెట్ జట్టుకు అనంత అమ్మాయి ధారమోహన్ ఎంపికైం ది. ఇటీవల శ్రీకాకుళం లో నిర్వహించిన క్రికెట్ టోర్నీ లో ప్రతిభ కనబర్చిన ధార మోహన్ జాతీయ పోటీలకు అర్హత సాధించి ంది. అనంతపురం స్పోర్ట్స్ అకాడమిలో ధార మోహన్ సాధన చేస్తోంది. నెలాఖరులో జరిగే జాతీయ క్రికెట్ పోటీలకు ఆంధ్ర అండర్-19 జట్టు తరు పున ప్రాతినిథ్యం వహించనుంది. ధారమోహన్ ఈమె ఆర్ రౌండర్ ప్రదర్శనతో గతంలో అండర్-15 ఆంధ్ర-ఎ జట్టుకు ఎంపి కై మంచి ప్రతిభ చాటారు. శ్రీచైతన్య పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది.



ధార మోహన్

## ఘనంగా బాలల దినోత్సవం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

స్థానిక మూడవ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా 3టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ డి.నాగేష్ పాఠశాల డైరెక్టర్లు ఎం.పి. శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, హెచ్‌ఎం జి.లావణ్య రామ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బాలల దినోత్సవం యొక్క ప్రత్యేకత, పిల్లలకు ఎంతో ఇష్టమైన చాచా నెహ్రూ గొప్పతనం గురించి వివరించారు. చిన్నారులు నెహ్రూ వేషధారణతో వేదికకి మరింత అందాన్ని చేకూర్చారు. పిల్లలందరూ వివిధ రంగుల రంగుల వస్త్రధారణతో ఆటపాటలతో మరింత అందాన్ని చేకూర్చారు. చిన్నారులు తీయని మాటలతో నెహ్రూ గురించి ఎంతో చక్కగా వివరించారు. అంతేకాకుండా బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. చివరలో జనగణమన పాడి, స్వీట్స్ పంచి కార్యక్రమాన్ని ముగించారు.



బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీ సాయి విద్యానికేతన్‌లో బాలల దినోత్సవం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాల దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పాఠశాల యాజమాన్యం పూలమాల వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించారు. విద్యార్థులు నెహ్రు వేషదారణలు పలువురిని ఆకర్షించారు. తరువాత పాటలు, నృత్యాలు ఉపన్యాసాల ద్వారా సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కేశవరెడ్డి, ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

## మాంటి స్సోరిలో ఘనంగా బాలల దినోత్సవం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

స్థానిక సంగమేష్ నగర్, గుత్తిరోడ్డులో మాంటిస్సోరి పాఠశాలలో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ సి.సూర్య నారాయణరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలల కార్యదర్శి కె.మాధవిజ్యోతి ప్రజ్వలనతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యంగా మన దేశ సైనికులు అకుంఠిత దీక్షతో ప్రజలకు చేస్తున్న సేవలు, దేశరక్షణకై వారి త్యాగాలను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించిన దృశ్య రూపకం అందరినీ ఆకట్టు కుంది. అంతేకా కుండా భక్త ప్రహ్లాద, మగువా వందనం వంటి నాటికలు, ప్రశంశలు పొందాయి. మొబైల్ ఫోన్, సామాజిక మాధ్యమాలు విద్యార్థులపై చూపే దుష్ప్రభావాన్ని వివరించే నాటిక అందరినీ ఆలోచిం పజేసింది. కెజి చిన్నారులు చాచా నెహ్రూ వేషధారణలో ముచ్చట గొల్పారు. అనంతరం చిన్నారులు పాటలు, నృత్యాలు, ఉపన్యాసాల ద్వారా సంబరాలకు రంగుల ద్దారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ కె.పద్మావతి, ఎ.రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాలల దినోత్సవం సందర్భంగా వివిధ వేషధారణల్లో బాలలు

## కోటంకలో సామాజిక తనిఖీ గ్రామసభ

గార్లదిన్నె, నవంబర్ 14ప్రభాత వార్త: కోటంక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామ సభను మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు, బీడు భూములన్నీ పంట నమోదు (క్రాప్ బుకింగ్)లో నమోదయ్యాయని తెలిపారు. పంట మార్పులు, విస్తీర్ణంలో తేడాలు, పంట రకం, నీటి సౌకర్యం తదితర విషయాల్లో ఏవైనా లోపాలు ఉన్న రైతులు ఈ రోజు, రేపటిలోపు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రంలో గురువారం గ్రామసభలను నిర్వహించినట్టు సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సూర్య, హరిబాబు, విఏఏ అశ్విని, కోటంక సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి సోముశేఖర్

## గార్లదిన్నె శాఖా గ్రంథాలయం నందు ఘనంగా ప్రారంభమైన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు.

.గార్లదిన్నె నవంబర్ 14ప్రభాతవార్త: జిల్లా గ్రంథాలయ సంస్థ అనంతపురం ఆదీనములో పనిచేయు చున్న శాఖా గ్రంథాలయం గార్లదిన్నె నందు శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించబడ్డాయి. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ప్రధానోపాధ్యాయులు విజయ మాట్లా డుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు అన్ని రకాల పుస్తకాలు చదవాలని, ఏ ఒక్కా పుస్తకం తక్కువ కాదని చిన్న పుస్తకం చదవడం ద్వారా కూడా ఎంతో జ్ఞానం సంపాదించవచ్చని తెలియజేశారు. గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని, ప్రతి ఒక్క విద్యార్థి ఆసక్తిగా పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోగ్రంథాల యాధికారి ణికెయం.శిరీష ,ఉపాధ్యాయులు,వి ద్యార్థిని విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు

## ఏసిఏ అండర్-16 ప్రాబబుల్స్‌కు నలుగురు క్రీడాకారులు ఎంపిక

అనంతపురం సిటీ, నవంబర్ 14 ప్రభాతవార్త

ఏసిఎ ఆధ్వర్యంలో జరగనున్న అండర్-16 మల్టీ డే స్టేట్ ప్రాబబుల్స్‌కు జిల్లా నుంచి నలుగురు క్రీడా కారులు ఎంపికైనట్లు ఏడిసిఎ కార్యదర్శి భీమలింగారెడ్డి పేర్కొన్నారు. ఏసిఎ అండర్-16 సెలక్షన్ మ్యాచ్‌లలో ఈ నెల 15 నుంచి 25 వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుంచి సాత్విక్, ఆదినారాయణరెడ్డి, సంజయ్‌కుమార్, దేవాన్షులు ఎంపికయ్యారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ఈ సందరర్భంగా ఆయన అభినందించారు.

## చలికాలం రాకనే.... విద్యార్థులకు దుప్పట్లు...!

### - జిల్లా కేంద్రం నుండి హాస్టల్స్‌కు సరఫరా చేసిన అధికారులు - విద్యార్థులకు పంపిణీ చేస్తున్న వార్డెన్లు - దుప్పట్లు నాణ్యతపై హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

చలికాలంలో విద్యార్థులు ఇబ్బం దులు పడకూడదనే మంచి ఉద్దేశంతో కూటమి ప్రభుత్వము ముందస్తు చర్యలు తీసుకుంటుంది. హాస్టల్స్ విద్యార్థులకు దుప్పట్లు ( కార్పెట్, బెడ్ షీట్) లను జిల్లా కేంద్రానికి సరఫరా చేసింది. అక్కడి నుండి డివిజన్ కేంద్రాలకు, అక్కడి నుండి హాస్టల్స్‌కు సరఫరా చేశారు. వార్డెన్లు కూడా విద్యార్థులకు పం పిణీ చేశారు. దుప్పట్లు నాణ్యతగా ఉండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో 55 ఎస్సీ హాస్టల్స్‌లో వసతి పొందుతున్న 5400 మంది పేద విద్యార్థులకు దుప్పట్లు (ఒక బెడ్ షీట్, ఒక కార్పెట్) పంపిణీ చేయడానికి బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. అక్కడ గోడౌన్లో భద్రపరిచిన తర్వాత రెండు రోజుల్లో హాస్టల్స్‌కు సరఫరా చేశారు. వార్డెన్లు కూడా విద్యార్థులకు పంపిణీ చేశారు. అదేవిధంగా 3 ఎస్టీ హాస్టల్స్‌లో 420 మంది విద్యార్థులకు దుప్పట్లు మూడు రోజుల క్రితం జిల్లా కార్యాల యానికి చేరుకున్నాయి. అక్కడ నుండి జిల్లా అధికారి శ్రీనివాసరావు వార్డెన్లకు అందజేశారు. వార్డెన్లు కూడా విద్యా ర్థులకు పంపిణీ చేశారు. అదేవిధంగా 38 బీసీ ప్రీ మెట్రిక్ హాస్టల్స్ లో వసతి పొందుతున్న 4066 మంది విద్యా ర్థులకు అదనంగా దుప్పట్లు తాజాగా జిల్లా కార్యాల యానికి చేరుకున్నాయి. అక్కడి నుండి డివిజన్ కేంద్రాలకు, అక్కడ నుండి హాస్టల్స్‌కు సరఫరా చేశారు. సరఫరా అయిన హాస్టల్స్‌లో వార్డెన్ కూడా విద్యార్థు లకు పంపిణీ చేశారు. అన్ని హాస్టల్స్ లోని విద్యార్థులకు ఒకటి ,రెండు రోజుల్లో దుప్పట్లు పంపిణీ పూర్తి అవుతుందని సంక్షేమ శాఖల జిల్లా అధికారులు తెలిపారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు :** చలికాలం ప్రారంభం కాకముందే ప్రభుత్వము హాస్టల్స్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడానికి జిల్లా కేంద్రానికి సరఫరా చేసింది. జిల్లా అధికారులు కూడా వాటిని డివిజన్ కేంద్రాలకు సరఫరా చేసి అక్కడ నుండి హాస్టల్స్‌కు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. సరఫరా అయిన హాస్టల్స్‌లో వార్డెన్లు కూడా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆ దుప్పట్ల నాణ్యత చాలా బాగా ఉండడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దుప్పట్లను చూపుతున్న బిసి వెల్ఫేర్ విద్యార్థులు



వార్డెన్‌కు దుప్పట్లు అందజేస్తున్న జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు



దుప్పట్లు అందుకున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

## ఘనంగా ప్రారంభ మైన 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పండిట్ జవహర్ లాల్ నెహ్రు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేసి వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో గ్రంథాలయలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యదర్శి రమ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాలకు ఉఈయోగపడే పుస్తకాలు గ్రంథాలయాలలో ఉన్నాయని వాటిని ఉపయోగించు కొని ప్రజలు విద్యావంతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంనకు అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ అధ్యక్షత వహించారు. డిప్యూటీ డిఇఓ మల్లారెడ్డి, డిప్యూటీ లైబ్రరియన్ పి.కమ్మన్న, సహా గ్రంథాలయాధికారి డి.గోవిందు, కెఎస్‌టి గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగ రత్నమ్మ, ప్రముఖ కవి కళాభూషణ్ డాక్టర్ రామలింగ య్య, సోషల్ వర్కర్ ఆషారాణి, రిటైర్డ్ టీచర్ రాష్ట్ర అవార్డు గ్రహీత పుట్లూరు శ్రీరాములు, రిటైర్డ్ డీఎస్పీ ఎక్స్ యిస్ జె.హరి, మహేష్, సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రాజు, రామాంజినమ్మ, జిఎమ్ బాషా, కిరణ్, జీవన, బాల చంద్ర, ఇందిర మ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, శిరీషా, గంగాధర్ మొద లగు వారు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## ప్రభుత్వ కళాశాలలో ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవ వేడుకలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపతి అనంతపురంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మశ్రీ, వాణిజ్యశాస్త్ర విభాగ అధిపతులు వెంకటస్వామి, శేఖర్, సుగప్ప అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథా లయాలను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడారు. ప్రతిరోజు కళాశాల గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని మీ యొక్క విజ్ఞానాన్ని పెంచు కోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల కేంద్ర గ్రంథాలయ అధికారి డాక్టర్ పి.కేశవ మాట్లాడుతూ.. మన కళాశాల గ్రంథాలయంలో దాదాపుగా ఒక లక్ష 18 వేల పుస్తకాలున్నాయి. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. అదేవిధంగా గ్రంథాలయాల వలన కలిగే ఉపయోగాల గురించి మిగతా అధ్యాపక బృందం తెలియజేశారు. ఈ యొక్క గ్రం థాలయ వారోత్సవాల సందర్భంగా నవంబర్ 14వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు ఈ వారమంతా ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుం దన్నా రు. కళాశాల కేంద్ర గ్రంథాలయ ంలో రెండు రోజులు 15వ తేదీ 17వ తేదీ బుక్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మశ్రీ

## పోలీసులను అడ్డుపెట్టి ఉద్యమాన్ని ఆపలేరు

### - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, నవంబర్ 14 ప్రభాతవార్త

అధికార పార్టీ నేతలు పోలీసులను అడ్డు పెట్టి వైసిపి ఉద్యమాలను ఆపలేరని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని అర్బన్ నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం పంచాయితీ తపోవనం సర్కిల్‌లో శుక్రవారం నిర్వహించారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మధన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలందరికీ మెరుగైన వైద్య సేవలతోపాటు పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పిపిపి విధానంలో తన అనునాయులకు కట్టబెట్టేందుకు చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనికి నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. అందులో భాగంగానే రెండు రోజుల క్రితం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా ఉద్యమన నిరసన ర్యాలీ విజయవంతం కావడంతో ఓర్వలేని కూటమి నేతలు పోలీసులను అడ్డం పెట్టుకుని ర్యాలీలో పాల్గొన్న యువకులను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి రౌడీ షీట్లు తెరుస్తామని బెదిరించారన్నారు. బైండోవర్ పేరిట సంతకాలు చేయించుకోవడం సరైన విధానం కాదన్నారు. అప్రజాస్వామిక పద్దతిలో పోలీసు అధికారులు, అధికార పార్టీకి దాసోహమయ్యే పోలీసులకు రానున్న రోజుల్లో తగిన రీతిలో బుద్ది చెబుతామని ఆయన హెచ్చరించారు. అక్రమ నిర్బంధాలు చేస్తే పోలీస్‌స్టేషన్లను ముట్టడిస్తామన్నారు. పిపిపి విధానాన్ని రద్దు చేసే వరకు వైసిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్చందంగా హాజరైన శిభిరంలో పిపిపి విధానంలో సంతకాలు చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, వైసిపి వివిధ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర, ఓబిరెడ్డి, ఎద్దుల అమర్‌నాథ్‌రెడ్డి, వైసి బాబు, సైఫుల్లా బేగ్, శ్రీదేవి, చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బిసి.రమేష్‌గౌడ్, నగరాధ్యక్షులు చింత సోమశేఖర్‌రెడ్డి, వైసిపి సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతినాయుడు, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు నరేందర్‌రెడ్డి, వైసిపి నేతలు మల్లెల వేణుగోపాల్, అశోక్, పుల్లారెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోటి సంతకాల కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

## 17వ తేదీ నుంచి యధావిధిగా మండల పూజలు ప్రారంభం

అనంతపురం కల్చరల్, నవంబర్ 14 ప్రభాతవార్త

ఈ నెల 17 నుంచి ఆలయంలో పూజలు యధావిధిగా కొనసాగించాలని కోర్టు నుంచి ఆదేశాలు అందాయని శ్రీసాయి అయ్యప్ప సేవ సమాజం సెక్రటరీ నాగలింగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో కొంత మంది అయ్యప్ప స్వామి ఆలయ విషయంలో అనేక విధాలుగా ఆరోపణలు చేశారన్నారు. అయితే ఈ ఆరోపణలన్నీ అవాస్తవమని జిల్లా అధ్యక్ష పదవిలో ఉన్న మణికంఠ రికార్డు నిర్వాహకులన్నీ సక్రమంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. కోర్టు నుంచి స్టేటస్ అండ్ కో తీర్పు వచ్చిందన్నారు. ఎక్కడ అక్రమాలు జరిగినట్లు నిరూపితం కాలేదని అయ్యప్ప సేవా సమాజం కార్యదర్శి నాగలింగారెడ్డి తెలిపారు. గతంలో అవిశ్వాస తీర్మానం పెడితే కేవలం నలుగురు సభ్యులు మాత్రమే ఆమోదించారని, ఈ అవిశ్వాస తీర్మానం రద్దు చేస్తున్నట్లు రిజిస్టర్ ప్రకటించారన్నారు. దీంతో అయ్యప్ప స్వామి ఆలయం వివాదం ఇప్పటికి ముగిసిందన్నారు. దీనిపై ఎలాంటి ఆరోపణలు చేయటానికి వీలులేదని స్పష్టం చేశారు. అధ్యక్షుడు మణికంఠ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పోలీసుల సమక్షంలో లాకర్‌ను తెరిచి బంగారు ఆభరణాలను స్వామివారికి అల ంకరించి, మలయాళ సమాజ్ అధ్యక్షుడు నందకు మార్, నాగలింగారెడ్డి ఆధ్వర్య ంలో పూజా కార్యక్రమాలు యధావి ధిగా నిర్వహి స్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి వీరాంజ నేయులు, భక్తాదులు సోను, వెంకటేష్, భరత్, హేమ కిరణ్, అంకె తేజ, రాజా, భార్గవ్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీసాయి అయ్యప్ప సేవా సమాజం నేతలు

## మధుమేహం ముప్పు-అందరికి ఉందని చెప్పు - తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్

శింగనమల, నవంబర్ 14 ప్రభాతవార్త

నేడు మారుతున్న జీవన శైలి, జీవన వవిధానంలో మార్పులు, ఆహారపు అలవాట్లు వా ్యయామం లేక పోవడం, ఒత్తిడి, చెడు అలవాట్ల ద్వారా చాలా వరకు మధు మేహంకు గురవుతున్నారని తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. "మధుమేహం ముపు -అందరికి ఉందని చెప్పు" అనే ప్రధాన నినాదంతోనే కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా కల్తీ, నిల్వ చేసిన ఆహారం, ఫాస్ట్ ఫుడ్‌ను నివారించడం, ధూమపానం, మద్యపానంలకు స్వస్తి పలకడం తగిన శారీరక వ్యాయామం చేయడం, యోగ, ధ్యానం తదితర అలవాట్ల ద్వారా మధుమేహం భారిన పడకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ గ్రేస్ లత, మహిళా పర్యవేక్షకురాలు నాగమ్మ, డాక్టర్ తేజశ్విని, సిహెచ్ఓ గంగాధర్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల పరిధిలోని ఉల్లికల్లు, కొరివిపల్లి, పెరవలి గ్రామాల్లో నిర్వహించారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

## వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన శ్రీనివాసనాయక్

శింగనమల, నవంబర్ 14 ప్రభాతవార్త

వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయంలో అనంతపురం జిల్లా వైఎస్ఆర్‌సిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు నాయక్, భార్య మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ గీతాభాయి తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం శ్రీనివాసులు నాయక్ మాట్లాడుతూ.. తమను చూసిన వెంటనే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శివపార్వతులు వచ్చారని అంటు ంటే తమకు ఇంతకన్నా ఏం కావాలన్నా జీవితంలో అనిపించిం దన్నారు.

## విద్యతో పాటు సమాజాన్ని చదువుతూ దేశాభివృద్ధిలో బాగస్వాములు కావాలి

### - ఎంఈఓ జయానాయక్ - ఘనంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పామిడి, నవంబర్ 14 ప్రభాతవార్త

విద్యార్థులంతా విద్యతో పాటు సమాజాన్ని చదువుతూ దేశాభివృద్ధిలో బాగస్వాములు కావాలని ఎంఈఓ జయానాయక్ పిలుపునిచారు. స్థానిక గ్రంథాలయంలో మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని పురష్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించిన ఎంఈఓ జయానాయక్ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వార అనంతమైన విజ్ఞానాన్ని పొందవచ్చని అందువల్ల విద్యార్థి దశనుండే ఏకాగ్రతతో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కోరారు. టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంకుమార్ మాట్లాడుతూ ఈనెల 20వ తేది వరకూ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని తెలియజేస్తూ ప్రతిఒక్కరూ గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సి న అవసరం ఎంతైనావుందన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఎంతగానో తోడ్పడుతాయని పుస్తకాలను చదవటం మనందరి బాధ్యత అంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వెంకటలక్ష్మి, టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటి నవీన్, సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రకారుడు దార్శనికుడిగా గుర్తింపు పొందిన నెహ్రూ

### - నెహ్రూ సేవలను కొనియాడిన శ్రీ చైతన్య టెక్నో పాఠశాల డైరెక్టర్ రమణారెడ్డి - ఘనంగా బాలల దినోత్సవం

పామిడి, నవంబర్ 14 ప్రభాతవార్త

భారతదేశానికి ప్రధానమంత్రిగా అనేక సేవలందించిన జవహర్‌లాల నెహ్రూ ఒక రచయత, చరిత్రకారుడు, దార్శనికుడిగా గుర్తింపు పొందిన మహానుభావుడని శ్రీ చైతన్య టెక్నో పాఠశాల డైరెక్టర్ రమణారెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని పురష్కరించుకుని పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించి బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక నాయకుడిగా ఎదిగిన జవహర్‌లాల్‌నెహ్రూ దేశానికి మొదటి ప్రధానమంత్రి అయ్యారని తెలిపారు. నెహ్రూను పిల్లలు చాచా అని సంభోదిస్తారని తెలియజేస్తూ నేటి బాలలే రేపటి భవితకు ఆధారమని విద్యార్థులంతా ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యను క్రమశిక్షణతో ఆలకిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల మధ్య రమణారెడ్డి కేక్ కట్ చేశారు. చిన్నారుల వేశాదారణలు, విద్యార్థినీ విద్యార్థులు ఆలపించిన గేయాలు, చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల మధ్య కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ రమణారెడ్డి.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

బుక్కరాయసముద్రం నవంబర్ 14 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోశుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాల యాధికారి పున్నం విజయభాస్కర్ తెలిపా రు. ముందుగా చిన్నారులందరికి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథి తులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రామ పాల్గొన్నారు. ఈ సందర్భంగ శ్రీ జవహార్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. అనంతరం వారు మాట్లడుతూ నేటి బాలలే రేపటి నవ భారత నిర్మా తలు, వారిబంగారు భవిష్యత్తు కోసం మనమంతా కలిసి పనిచేద్దాం. బాలల శ్రేయస్సే లక్షంగా మన రాష్ట్రాన్ని భారత దేశానికే ఆదర్శంగా తీర్చిది ద్దదా ం,కల్మషం లేని మనసు చిరునవ్వుల తేజస్సు చిన్నారుల సొంతం పసి మొగ్గల బంగారు భవిష్యత్తు వెలుగుమయం కావాలన్నారు. ఈ కార్యక్రమం లో దుర్గావత్ అర్జున నాయక్ ప్రిన్సిపాల్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠ శాల బుక్కరాయసముద్రం, ఉపాధ్యాయులు అశ్వర్థనారాయణ, ఆంజనేయు లు, నాగరాజు, అనీల్, పరమేశప్ప, ముసలన్న తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.



నెహ్రూచిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న అధికారులు

## బాలల దినోత్సవంలో పాల్గొన్న కౌన్సిలర్ రసూల్‌బీ

తాడిపత్రిటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని 25వ వార్డులోని ప్రైమరీ మున్సిపల్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవం కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రసూల్‌బీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలల విద్యార్థులచేత కేక్ కట్ చేయించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వార్డు బూత్ ఇన్‌చార్జ్ యూనిస్, యూనిట్ కో కన్వీనర్ బుజ్జి, బూత్ ఇన్‌చార్జ్ రామకృష్ణ, రాము, 25వార్డు టిడిపి నాయకులు లక్ష్మినారాయణ, అబ్దుల్లా, బాల, చిన్నస్వామి, రమణ, రంగనాయకులు, పెద్దయ్య, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు



కేక్ కట్ చేయిస్తున్న కౌన్సిలర్ రసూల్‌బీ

## బీహార్‌లో అభివృద్ధికే పట్టం కట్టారు

### - విజయోత్సవ వేడుకల్లో బిజెపి నేతలు

అనంతపురం సిటీ, నవంబర్ 14 ప్రభాతవార్త

బిజెపి ఎన్నికల్లో అభివృద్ధికే పట్టం కడుతూ మరోమారు బిజెపి కూటమికి పట్టం కట్టారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బీహార్‌లో బిజెపి కూటమి భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఆ పార్టీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డితోపాటు జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, స్టేట్ సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీహార్‌లో బిజెపి, నితీష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలు కూడా అభివృద్ధిని చూసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల నమ్మకంతో 200 స్థానాలకుపైగా బిజెపిని గెలిపించారన్నారు. కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శిలు అశోక్‌రెడ్డి, ఆంజినేయులు, శ్రీదేవి, మైనార్టీ నేత మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



కేక్ తినిపించి సంబరాలు చేసుకుంటున్న బిజెపి నేతలు

**CHANGE OF SUR NAMES**

I, PAIPATI HINDU SEKHAR REDDY (OLD NAME) S/o THAMMI REDDY PATEEL, RESIDENT AT D.No 12-3-521, JESUS NAGAR BEFORE TRELLIS SCHOOL ANANTAPUR- 515001, A.P. I HAVE CHANGED MY NAME AS PATEEL HINDU SEKHAR REDDY (NEW NAME) S/o PATEEL THAMMI REDDY HERE AFTER MY NAME IS KNOWN AS PATEEL HINDU SEKHAR REDDY (NEW NAME ) S/o PATEEL THAMMI REDDY

04ATP14_04ATP14.qxd 14-11-2025 PM 11:17 Page 1



# చిన్న వయసు నుంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి

## - నేటి పిల్లలు రేపటి దేశ భవిష్యత్తు, ఎమ్మెల్యే పరిటాల సునీత
## - చెన్నేకొత్తపల్లిలో ఘనంగా 58వ గ్రంథాలయ వారోత్సవాలుబాలల దినోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త

చిన్న వయసు నుండి పుస్తకాలు చదవడం అలవాటు నేర్చుకోవాలని అప్పుడే నేటి పిల్లలే.. రేపటి రోజు మన దేశానికి భవిష్యత్తుగా మారుతారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శుక్రవారం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో 58వ గ్రంథాలయ వారోత్స వాలు, బాలల దినోత్స వం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే చిన్నారులతో కలిసి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల విశిష్టత గురించి చిన్నారులతో ప్రతిజ్ఞ చేయిం చారు. పిల్లల్ని ఆప్యాయంగా పలుకరిస్తూ.. వారి చదువుల గురించి ఆరా తీశారు. అలాగే కుటుంబ పరిస్థితుల గురించి కూడా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ప్రతి గ్రామంలోనూ గుడి, బడి, గ్రంథాలయాలు ఉండాలన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞా నాన్ని ఎలా పెంపొందించుకోవాలో చిన్నారులకు ఉపాధ్యాయులు తెలియ జేయాలన్నారు. 20వ తేదీ వరకు వారం రోజుల పాటు గ్రంథాల యంలో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరి నీ భాగస్వా మ్యం చేయాలన్నారు. ఇప్పటికే రూ.25లక్షల నిధులతో చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో గ్రంధా లయ భవనాన్ని నిర్మించామన్నారు. ఇంకా అవసరమైన వసతులను సమ కూరుస్తామని, ప్రతి మండలం లోనూ గ్రంథాలయం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు బాల్యం అనేది ఒక వరమని, పిల్లలకు చదువు ఎం త ముఖ్యమో ఆట పాట లు, వారి బాల్యాన్ని సం తృప్తిగా చూడటం కూడా అంతే ము ఖ్య మన్నారు. కుటుంబంలో పరిస్థి తులు ఎలా ఉన్నా పిల్లలు బయ టకు వస్తే ఎంతో ఆహ్లాదంగా గడుపుతారన్నారు. పసి వయసులో వారికి ఎలాంటి బాధలు లేకుండా చూసుకోవాల్సి న బాధ్యత తల్లి దండ్రులపై ఉందన్నారు. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దితే దేశానికి వారు భవిష్యత్ అవుతారని ఎమ్మె ల్యే సునీత అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఎల్.నారాయణ చౌదరి, హిందూపురం పార్లమెంటు ఉపా ధ్యక్షులు, దండు ఓబులేసు, మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, అమరేంద్ర, రిటైర్డ్ హెడ్మాస్టర్ రంగారెడ్డి, గ్రంథాల య సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రొద్దం చిన్నమంతూరు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ

## పేదల కలను నిజం చేసిన ఎన్డీఏ ప్రభుత్వం. ఎంపీ బి కే పార్థసారథి



ఎంపీ బీకే పార్థసారథిను ఆపిల్ పండ్ల హార ంతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



ఎంపీ బీకే పార్థసారథిను ఆపిల్ పండ్ల హార ంతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రొద్దం. నవంబర్ 14 ప్రభాతవార్త

మండల కేంద్రమైన రొద్దం చిన్నమంతురు గ్రామాలలో ఎంపీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు బి.కె పార్థసారథి భూమి పూజ చేయడం జరిగింది శుక్రవారం చిన్న మంతూరు గ్రామంలో 10 లక్షల రూపాయలు నిధులతో కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేయడానికి వచ్చిన ఎంపీ బీకే పార్థసా రథిని గ్రామస్తులు యాపిల్ పండ్ల హారంతో ఘనంగా స్వాగతించడం జరిగింది అనంతరం రొద్దం గ్రామంలో ఆరు లక్షల 50 వేల రూపాయల నిధులతో మసీదు పక్కన ఉన్న స్థలంలో మినరల్ వాటర్ ప్లాంట్ కు భూమి పూజకు శ్రీకారం చుట్టడం జరిగింది ముస్లింలు ఎంపీ పార్థసారథిని నాయకులకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్ర మాలతో దూసుకు పోతున్నామని రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్ర మాలకు శ్రీకారం చేపట్టబోతున్నామని నిరుపేదలకు పక్కా ఇల్లు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇ వేకాకుండా పేదలపై భారం తగ్గించాలని ఆలోచనతో ప్రధానమంత్రి నరే ంద్ర మోడీ కొత్తగా జీఎస్టీ అమలు చేయడం చాలా సంతోషకరమైన విషయం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలియ జేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అధికారులు తెదేపా నాయకులు శుభ రత్నమ్మ జివిపి నాయుడు నరసింహులు నాగరాజు సత్తి కలీముల్లా మున్నా బాబు భాష నజీర్ తదితరులు పాల్గొన్నారు

# లడ్డూ తయారీలో కల్తీ జరిగి ఉంటే సిట్ వాస్తవాలు వెల్లడించాలి..!

## -లేని కల్తీ జరిగిందంటూ దుష్ప్రచారంచేసి దేవున్ని రాజకీయాల్లోకి లాగొద్దు - కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడం దుర్మార్గం -2015లో కల్తీ నెయ్యి వాడి దొరికినపుడు ఎందుకు బాధ్యత వహించలేదు
## -కల్తీ నెయ్యి వ్యవహారంపై మీడియాతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ. నవంబర్ 14 ప్రభాతవార్త

తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ జరిగి ఉంటే సిట్ వాస్తవాలు వెల్లడించాలని వైఎస్సా ర్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. లడ్డూపై ఆధారాల్లేని ఆరోపణలు చేస్తూ కల్తీ జరిగిందంటూ కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆయన వాపోయారు. శుక్రవారం వై.శివరా మిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేవలం వైఎస్సా ర్‌సీపీ నేతలపై కక్ష సాధింపు రాజకీయాల కోసం చివరికి దేవుడిని కూడా రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గమన్నారు. నెయ్యి నాణ్యతపై టీటీడీ ఈవో, ముఖ్య మంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ తలోమాట మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. లడ్డూ ప్రసాదం కల్తీపై ఆధారాలుంటే ఆ వివరాలను సిట్ అధికారులెందరు బయటపెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి 17 నెలలు గడుస్తుండగా తిరుపతి, సింహాచలం, కాశీబుగ్గ ఆలయాల్లో వరుసగా దుర్ఘటనలతో భక్తులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. తిరుమలలో మునెపెన్నడూ లేనివిధంగా మద్యపానం, మాంసాహారం భుజించడం, చెప్పులతో శ్రీవారి దర్శనానికి రావడం లాంటి అపచారాలు జరుగుతున్నాయని వాటి నుండి ప్రజల దృష్టిని మరల్చడా నికిగాను ప్రభుత్వం తిరుమల శ్రీవారి లడ్డూ అంశాన్ని తెరపైకి తీసుకొస్తూ కాలం వెల్లబుచ్చుతోందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే టీటీడీ ఈవో, పాలక మండలిని మార్చారని ఈ నేపథ్యంలోనే జూన్ 21న అప్పటి టీటీడీ ఈవో శ్యామలరావు టీటీడీలో అంతా సక్రమంగా ఉందని చెప్పారని, కొద్ది రోజుల తరువాత లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ ఉందని చెబితే ప్రభుత్వ పెద్దలు మాత్రం అనిమల్ ఫ్యాట్ కలిసిందని పొంతనలేని ప్రకటనలు చేశారన్నారు. లడ్డూ వ్యవహంలో సరైన దర్యాప్తు చేయాలని టీటీడీ మాజీ చైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించినపుడు ఆధారాల్లేకుండా ప్రభుత్వం లోని పెద్దలు ఏరంగా ఇలా మాట్లాడతారని సాక్షాత్తు సర్వోన్నత న్యాయస్థానమే ప్రశ్నించిందని ఇది వాస్తవం కాదా అని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. వై.వి.సుబ్బారెడ్డి లడ్డూ వ్యవహారంపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఆయనపైనే లేనిపోని ఆరోపణలు చేస్తోందని విమర్శిం చారు. వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వంలో నెయ్యి ధరల గూర్చి మాట్లాడుతూ 320 రూపాయలకు కిలో స్వచ్ఛమైన నెయ్యి వస్తుందా అని ప్రశ్నించారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో కిలో నెయ్యి 273, 306, 276 రూపాయలకే కొన్నారని వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వం మాత్రం ఐదేళ్లలో తక్కువ ధరలకు కొన్నట్టా అని ప్రశ్నించిన ఎమ్మెల్సీ అప్పటి ప్రభుత్వ హయాంలోవున్న ల్యాబ్‌లోనే వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వంలో కూ డా పరీక్ష చేశారన్నారు. కూటమి ప్రభు త్వం టీటీడీను రాజకీయాలకు వాడుకో వాలని యత్నిస్తుండటం సరైంది కాదన్నారు. చంద్ర బాబు అధికారంలో ఉన్నప్పుడు 2015 డిసెం బర్ 4న మీడియాలో శ్రీవారి లడ్డూ ప్రసాదం లో వినియోగించే నెయ్యిలో పూర్తిగా కల్తీ జరిగిందని వార్తలు వచ్చాయని నాడు జరిగిన తప్పుకు సూత్రధారులు, పాత్రధారులెవరో విచారణచేసి వాస్తవాలను నిగ్గుతేల్చి వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై అవాస్తవాలు ప్రచారం చేయడం ఇప్పటికైనా మానుకోవాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రభుత్వానికి హితవు పలికారు.

# ప్రజల సమస్యలకు పరిష్కార కోసమే ప్రజా దర్బార్..!

## - ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా - చెన్నేకొత్తపల్లి ప్రజా దర్బార్ లో సమస్యల వెల్లువ - డ్వాక్రా మహిళల సొమ్ము కాజేసిన వ్యక్తి నుంచి డబ్బు రాబట్టాలన్న ఎమ్మెల్యే సునీత





ప్రజా దర్బార్‌లో ప్రజా సమస్యలను వింటు అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త

ప్రజల సమస్యల కోసమే ప్రజాదర్బార్..ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి విజ్ఞప్తికి పరిష్కారం చూపిస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, పింఛ న్లు, ఇంటి పట్టాలు ఇవ్వాలని, కనకదాస విగ్రహ ప్రతిష్టకోసం, గీతా మందిరం కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తులు వచ్చాయి. ప్రజల నుంచి విజ్ఞప్తులు తీసుకుంటూ వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఇందులో ముఖ్యంగా చెన్నేకొత్తపల్లి మండలం ప్రసన్నాయపేటకు చెందిన కృష్ణారెడ్డి మహిళా సంఘాలను మోసం చేసి 33లక్షలు కాజేసిన సంఘటన మీద ఫిర్యాదు అందింది. మహిళా సంఘాల సభ్యులు కన్నీరు పెట్టుకుంటూ తమ సమస్య ను ఎమ్మెల్యే చెప్పుకున్నారు. మహిళలు ఎంతో కష్టపడి రుణాలు చెల్లించేం దుకు డబ్బు ఇస్తే ఇలా బ్యాంక్‌కు చెల్లించకుండా కృష్ణారెడ్డి అనే వ్యక్తి మోసం చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డి ఎక్కడున్న వెంటనే అరెస్ట్ చేయాలని మహిళలకు ఇవ్వా ల్సి న డబ్బును రికవరీ చేయాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. మరోవైపు మండలంలో ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నాయని ఆన్‌లైన్‌లో యజమానికి తెలియకుండా ఎలా పేర్లు మారుస్తారని నిలదీశారు. అర్హత ఉన్న వ్యక్తి అర్జీని రెవెన్యూ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పింఛన్లు, ఇంటి పట్టాలు త్వరలోనే అందజేస్తామన్నారు. మండల కేంద్రంలో భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్టా పనకు, గీతా మందరం నిర్మాణా నికి స్థలం మంజూరు చేస్తామన్నారు. నరసింగరాయుని పల్లి గ్రామం నుంచి ఓబులం పల్లి మెయిన్ రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపడుతా మన్నారు. బసంపల్లి వెళ్లేదారిలో మట్టి రోడ్డు నిర్మాణం అలాగే గ్రామంలో స్మశాన వాటికకు స్థలం మంజూరు చేస్తామన్నారు. ఇక్కడ వచ్చిన ప్రతి అర్జీకి నిర్దిష్ట సమయంలోనే పరిష్కారం చూపించాలన్నారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలు కూడా తెలియ జేయాలని, సంబంధిత అధికారులకు, ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు.

# మాజీ ఏవీఎస్వో సతీష్ మృతిపై సీబీఐ దర్యాప్తు నిర్వహించాలి..

## పరకామణి చోరీ కేసులో సూత్రధారులు, పాత్రధారులపై సమగ్ర విచారణ జరపాలి
## ఎం.ఎస్.రాజు, టీడీపీ బోర్డు మెంబర్



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్,ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.

మడకశిర టౌన్ నవంబర్ 14 ప్రభాతవార్త.

తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి చోరీ కేసుపై ఫిర్యాదు చేసిన టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్ అనుమానాస్పద మృతిపై సీబీఐ దర్యాప్తు నిర్వహించాలని శుక్రవారం మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం ఓ వీడియోను విడుదల చేశారు. పరకామణి చోరీకి సంబంధించిన కీలక పాత్రధారులు, సూత్రధారులు ఈ కేసు నుండి బయట పడేందుకు కీలక సాక్షిగా ఉన్న సతీష్ ను హత్యచేసి, తాడిపత్రిలోని రైల్వే ట్రాక్ పై మృతదేహాన్ని పడేసిన విషయాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని కోరారు. పరకామణిలో హుండీ డబ్బులను చోరీ చేసిన రవికుమార్, అతని వెనుక ఉన్న భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మరి కొంత మంది సూత్రధారులు, పాత్రధారుల విషయాలపై ఆరా తీయాల్సి న అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. పరకామణి కేసు విచారణ చివరిదశకు వచ్చిన తరుణంలో నేడు టీటీడీలో తన వాంగ్మూలం ఇచ్చేందుకు బయలు దేరిన సతీష్ తాడిపత్రి సమీపంలోని కోమలి రైల్వే ట్రాక్ పై శవమై తేలడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తెలిపారు. వైసీపీ పాలనలో జరిగిన దుర్మార్గాలకు సంబంధించిన సాక్షులకు భద్రత కల్పించాల్సి న అవసరం ఉందని పేర్కొ న్నారు. శవరాజకీయాలు వైసీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ లో కార్యకర్తలే నిర్ణయాధినేతలు - ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



కార్యకర్తల సమావేశంలో మాట్లా డుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ నవంబర్ 14 ప్రభాత వార్త.

మడకశిర నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్లు ,క్లస్టర్ ,యూనిట్ గ్రామ ,బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జెండాను ఆవి ష్కరించి నాయకులు కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబ రాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఎంపికైన వారిచే ప్రమా ణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే , మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో నిర్ణయాధినేతలు కార్యకర్తలే నని కార్యకర్తల సంక్షేమం కోసం వాళ్ళ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

పదవులు తీసుకొన్న నాయకులు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ బలోపేతం అయ్యేవిధంగా పార్టీ కార్యకర్తలు నాయకులను సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. వేరే నియోజకవర్గాలతో పోలిస్తే మడకశిర నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని మడకశిర పట్టణంలో ఐదు సంవత్స రాలలో ప్రధా న రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి అంబేద్కర్ సర్కిల్ దగ్గర డ్రైనేజీలు, కల్వర్టును ఏర్పాటు చేసి నూతనంగా కొత్త రోడ్లను వేయడం జరిగిం దన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతినిధులతో కూడిన డిఫెన్స్ పరిశ్రమను మడకశిరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువ నాయ కులు లోకేష్ బాబు పవన్ కళ్యాణ్ మంజూరు చేయడం జరిగింది. సోలార్ హబ్, రైతుల చిరకాల వాంఛ అన్నారు. వక్క మార్కెట్, ప్రాసెసి ంగ్ యూ నిట్, కృష్ణా జలాలు, సోలార్ హబ్, రైల్వే స్టేషన్, నేషనల్ హైవే , ఆర్డీవో కార్యాలయం త్వరలోనే రాబోతున్నాయి అని పేర్కొన్నారు. కరువు ప్రాంతం శాశ్వతంగా ఉన్న సాగునీటి సమస్యను తీర్చాలని దృఢ సంకల్పంతో హంద్రీనీవా కృష్ణ జలాలు తీసుకో వస్తున్నామన్నారు., అదేవిధంగా రాష్ట్రంలో మడక శిర ప్రాంతంలో వక్క రైతులు అధికంగా ఉండడంతో మడకశిర ప్రాం తానికి వక్క మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం జరుగుతోంది అన్నారు. ఒక సంవత్స రం లోపల మడకశిరకు రైల్వే స్టేషన్ పనులు పూర్తి అయి రైళ్లు రాబోతున్నాయి, గత వైసిపి మాజీ ఎమ్మెల్యే ధన దాహం వల్ల మడకశిర ప్రాంతంలో ఏర్పాటు కానున్న గార్మెంట్స్ యాజమాన్యం ప్రారం భించకుండా అర్ధాంతరంగా నిలిపివేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బెంగళూరుకు వెళ్లి గార్మెంట్స్ యాజమా న్యంతో చర్చించి తిరిగి మడకశిరకు రప్పించి స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజనప్ప, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ డైరెక్టర్లు, మున్సి పల్ చైర్మన్ నరసింహ రాజు. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ . కౌన్సి లర్లు కన్వీనర్లు జడ్పిటిసి సభ్యులు సింగల్ విండో అధ్యక్షులు క్లస్టర్ ఇన్చార్జులు ప్రధాన కార్యదర్శులు అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నూతన ఎన్‌జీజీవో సంఘం ఎన్నిక

## : ఎన్‌జీజీవో సహాధ్యక్షునిగా చిగురుపాటి శ్రీనివాసులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సంఘం సభ్యులు

తాడిపత్రి, నవంబరు14, ప్రభాతవార్తః

తాడిపత్రి నాన్ గెజిటెడ్ గవర్నమెంట్ అధికారుల నూతన సంఘాన్ని శుక్రవారం ఎంపిక చేశారు. నూతన సంఘం ఎన్నికలు జిల్లా శాఖ నుంచి వచ్చిన మహేశ్వరరెడ్డి, వెంకటేష్‌బాబు, ప్రవీణ్‌కుమార్‌లు అనే ముగ్గురు అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. తాడిపత్రి తాలూకా సంఘంలో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తాడిపత్రి ఎన్‌జీజీవో సంఘం అధ్యక్షునిగా వాసుమూర్తి యాదవ్, సహ అధ్యక్షునిగా చిగురుపాటి శ్రీనివాసులు, కోశాధికారిగా సురేష్‌బాబు, మహిళా విభాగం చైర్మన్‌గా సువర్ణ, సహ చైర్మన్‌గా శ్రీవాణి, కార్యదర్శిగా బాలమణిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా మహిళా విభాగపు చైర్మన్ జమ్మిలా బేగం తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ ంతో జిల్లా, రాష్ట్ర నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. తాడిపత్రి తాలూకా పరి ధిలోని నాన్ గెజిటెడ్ గవర్న మెంట్ అధికారుల సమ స్యల పరిష్కారానికి, వారి హక్కుల కోసం నిర్విరామ కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

# అలరించిన వీణా వాయిద్య ప్రదర్శన




సత్యసాయి మహాసమాధి చెంత రూప పనేసర్ బృందం



గ్ర్యాస్ట్రో ఎంటరాలజీ యంత్రాలను ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్.

పుట్టపర్తి రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త :

సత్య సాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీణ సితార వాయిద్య ప్రదర్శన భక్తు లను అలరించింది. ప్రఖ్యాత వీణ, సితార వాయిద్య కారులైన రూప పనేసర్ , ఉస్తాద్ కీర్పాల్ సింగ్ తమ వాయి ద్యాలతో హోరాహోరీగా పోటీపడ్డారు. ఇరువురి ప్రదర్శనతో ప్రశాంతి నిలయం సంగీత వాయిద్యాలచే ప్రకంపిత మైంది. అనంతరం ట్రస్ట్ వర్గాలు వారిని బాబా చిత్రపటంతో సత్కరిం చారు. సూపర్ హాస్పిటల్లో ప్రారంభమైన గ్ర్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్ప టల్లో నూతనంగా అడ్వాన్స్. గ్ర్యాస్ట్రో ఎంటరాలజీ, ఎండోస్కోపి సేవలను మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2.4 కోట్ల విలువైన ఈ అధునాతన పరికరాల ద్వారా జీర్ణవ్యవస్థను నిశితంగా పరిశీలించి చికిత్స ను అందించడానికి ఉపయోగక రంగా ఉంటు ందన్నారు. ఈ కార్యక్ర మంలో హాస్పిటల్ డైరెక్టర్ గురు మూర్తి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ గీతా కామత్, డాక్టర్ వేద విశ్వనాథన్ పాల్గొన్నారు.

# భట్రాజు కార్తీక వనమహోత్సవ పోస్టర్లు విడుదల

## -రేపు నేషనల్ పార్కుకు భట్రాజులు తరలిరండి




వనభోజన పోస్టర్లను విడుదల చేస్తున్న భట్రాజు సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం నవంబరు 14 ప్రభాతవార్త

భట్రాజు సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో కార్తీక వనమహోత్స వ పోస్టర్లను జిల్లా అధ్యక్షుడు యల్లమరాజు బాలాజీ అధ్యక్ష తను కార్యవర్గ సభ్యుల సమక్షంలో శనివారం విడుదల చేశారు. ఈ సందర భంగా యల్లమరాజు బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 16న నగర శివారులో వున్న నేషనల్ పార్కులో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వనభోజనాలు ఏర్పాటు చేశామని, ఉమ్మడి జిల్లాల్లో వున్న భట్రాజులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చాడు.

# గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎంపి పార్థసారథి

## - ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు, ఆలయ నిర్వాహకులు - ఆదర్శ రైతు గంగాధర్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి ఇంట తేనేటి విందులో ఎంపి - ఆలయ ప్రహరీ గోడకు రూ.లక్షల ఎంపి నిధులు వెచ్చింపు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపి పార్థసారథి

గోరంట్ల, నవంబర్ 14 ప్రభాతవార్త

గోరంట్ల మండలం కొండాపురం పంచాయతీ పరిధిలోని రాగిమేకలపల్లి గ్రామంలో పవిత్ర కార్తీక మాసంలో జరుగుతున్న వేడుకలకు గ్రామ ఆదర్శ రైతు, టిడిపి నేత గంగాధర్‌రెడ్డి ఆహ్వానం మేరకు గంగమ్మగుడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు హిందూపురం పార్లమెంటు సభ్యులు బికే పార్థసారథి ముఖ్యఅ తిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని మరువపల్లికి ఎంపి పార్థసారథి చేరుకోగానే మండల టిడిపి నాయకులు బోర్‌వెల్ అశ్వత్‌రెడ్డి, నీలకం ఠారెడ్డి, కొత్తపల్లి నరసిం హులు, మరువపల్లి వెంకటరంగారెడ్డి, నరేంద్రరాయల్, బిజెపి మం డల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ, వడల చంద్రశేఖర్‌రెడ్డి, కార్తీక్ తది తరులు పెద్దఎత్తున బాణా సంచా పేలుస్తూ గజమాలతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో వెంకటరంగారెడ్డి నివాసంలో ఆయన తేనేటి విందులో పాల్గొ న్నారు. అనంతరం రాగిమేకలపల్లి చేరుకుని గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ఆలయ శిలాఫలకాన్ని ప్రారంభించి, ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి పార్థసారథి మాట్లా డుతూ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎంపి నిధులను కేటాయించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆదర్శ రైతు టిడిపి నేత గంగాధర్‌రెడ్డి నివాసానికి చేరుకొని అక్కడ తీనేటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటిపల్లి ఈశ్వరయ్య, గంగంపల్లి నరసిం హులు, రవీంద్రారెడ్డి, కమ్మవారిపల్లి బాలకృష్ణ, రెడ్డిచెరువుకట్ట మోహన్, జెకె జగన్, టైలర్ లక్ష్మీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.